క్లుప్తంగా

అచ్యుతానందన్‌కు ఘన నివాళి

మైలవరం : కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మరణం తీరని లోటు అని సీపీఎం నాయకుడు శివనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని వేపరాల గ్రామంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేరళలో సీపీఎం పార్టీకి తీరని నష్టం అన్నారు. 17 సంవత్సరాల వయసులోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా చేరి కృష్ణపిల్లే నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాల్లో పాల్గొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విస్తృత స్థాయి సమావేశం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో బుధవారం ఉదయం 9.30గంటలకు వైఎస్సార్‌సీపీ పులివెందుల మున్సిపాలిటీ విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు పాల్గొంటారన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండల పరిధిలోన కపిల్ హోమ్స్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోన కుమారునిపల్లె గ్రామానికి చెందిన నందకిషోర్ పని మీద కడపకు ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. కడప డీసీసీ బ్యాంకులో ఔట్ సోర్సింగ్ అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న బత్తల బాబు బ్యాంకుకు సంభంధించిన నోటీసులను కమలాపురంలో అందచేయడానికి ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. వీరు ప్రయాణిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు కపిల్ హోమ్స్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో వీరిని చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

కోడి పందెం కేంద్రంపై పోలీసుల దాడి

వేంపల్లె : మండలంలోని ముతుకూరు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందెం కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. దీంతో 5 వాహనాలు, 4 సెల్ ఫోన్లతోపాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు సీఐ నరసింహులు తమ సిబ్బందితో కలిసి ముత్తుకూరు గ్రామ సమీపంలో ఆడుతున్న కోడి పందెం కేంద్రంపై దాడులు చేశారు. దీంతో కోడి పందెం ఆడుతున్న ముద్దనూరుకు చెందిన సుబ్బరాయుడు, ప్రొద్దుటూరుకు చెందిన రెడ్డప్ప, వేంపల్లెకు చెందిన మస్తాన్, ముతుకూరు బాబులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే ఒక కోడితోపాటు 5 వాహనాలు, 4 సెల్ ఫోన్లు వారినుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోడి పందెం ఆడుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం

చక్రాయపేట : వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులకు చిరుధాన్యాల సాగు కూడా ఎంతో లాభదాయకంగా ఉంటుందని ఏపీసీఎంఎఫ్ జిల్లా ప్రాజక్టు అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం చక్రాయపేట రైతు సేవాకేంద్రం వద్ద రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు ప్రకృతి వ్యవసాయం ద్వారా సులభంగా పండించుకోవచ్చని తెలిపారు. వర్షాభావ పరిస్థితులలో సేద్యం, తేమ సంరక్షణ, వర్షపు నీటిని వడిసి పట్టుకోవడం ఎలా అనే అంశాలపై ఊటుకూరు కేవీకే శాస్త్రవేత్తలు సాయిమహేశ్వరి, మహేష్ బాబు, మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖరరెడ్డిలు వివరించారు. అనంతరం సూర్యనంది కొర్రలు, వకుల రకం రాగులు, ఐసీహెచ్–5 రకానికి చెందిన హైబ్రీడ్ ఆముదాలను ఊటుకూరు వారి భారతీయ చిరుదాన్యాల పరిశోధనా సంస్థ షెడ్యూల్ కులాల ఉపప్రణాళిక ద్వారా పలువురికి ఉచితంగా పంపిణీ చేశారు.

అవగాహన కార్యక్రమం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

చింతకొమ్మదిన్నె : ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి వివిధ నేరాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా సైబర్ నేరాలు వాటి భారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలు వాటి వల్ల కలుగు దుష్ప్రభావాలు, సోషల్ మీడియా నేరాలు వాటి పట్ల జాగ్రత్తలు, చిన్నపిల్లలు, మహిళల పైన జరుగుతున్న నేరాలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు.

సంక్రమిత వ్యాధులు ఉన్నాయి.. జాగ్రత్త

- అప్రమత్తంగా ఉంటే వ్యాధుల నుంచి దూరం
- పశు వైద్యశాలల్లో వ్యాక్సినేషన్



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

సింహాద్రిపురం : రైతు నుంచి పారిశ్రామికవేత్తల దాకా ఏదోక రూపంలో జంతువులతో సహవాసం చేస్తున్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ నిమిత్తం ఆవులను, వ్యాపార నిమిత్తం గొర్రెలను, మేకలను, పందులను, కోళ్లను పెంచుకుంటూ ఉంటారు. కొందరు ఇళ్లలో కుక్కలు, పిల్లులను సాకుతుంటారు. సింహాద్రిపురం మండల వ్యాప్తంగా 13,100 గేదేలు, 1840 ఆవులు, 32,500 గొర్రెలు, 14,200 మేకలు, 114 పందులు, 32,150 కోళ్లు ఉన్నట్లు అధికారుల అంచనా. ఇదిగాక ఎవరికీ తెలియకుండా ఇళ్లలో ఎలుకలు సావాసం చేస్తుంటాయి. జంతువుల కారణంగా సోకే వ్యాధులపై కూడా అవగాహన కల్పించుకుని జాగ్రత్త పడకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పశువుల నుంచి మానవులకు సంక్రమించే స్వభావం ఉన్న వ్యాధులు జూనోటిక్ వ్యాధులు సోకకుండా వ్యాక్సినేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలి.

జంతువుల నుంచి సోకే వ్యాధులు ఇవే..

పశువుల ద్వారా మకూరి, గాలికుంటు, రేబీస్, ఆంత్రాక్స్, లిస్టీరి యోసిస్, బ్రూసెల్లోసెస్, క్యూ ఫీవర్, క్షయ, రామర, జెబీసియోసిస్, ఫైలేరియాసిస్, హైడాటిడోసిస్, ట్రిపనసోమియానస్, టాక్సోప్లాస్మానస్ వంటి వ్యాధులు సోకుతాయి. అలాగే కుక్కలు, పిల్లుల ద్వారా రేబీస్, లెప్టోస్పైరోసిస్, తామర, ట్రిఫనసోమియా సీస్, టాక్సోప్లాస్మోసస్, లార్వామైగ్రాన్, కాట్ స్క్రాచ్ ఫీవర్ వ్యాధులు సోకుతాయి. పందుల ద్వారా మెదడువాపు వ్యాధి, గాలికుంటు, ఇన్ఫయంజా, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్, లిస్టీరియోసిస్, సార్కోనల్లోసిస్, హైడాటిడోసిస్, తామర, ట్రైలినెల్లోసిస్ వ్యాధులు వస్తాయి. కోళ్లు, పక్షుల ద్వారా ఇన్ఫయంజా, క్లమీండియోసిస్, లిస్టీరియోసిస్, సాల్మోనెల్లోసిస్, క్షయ, తామర సిజ్జికోసిస్ వ్యాధులు సోకుతాయి. గొర్రెలు, మేకల ద్వారా లేబీస్, ఆంత్రాక్స్, లిస్టీరియోసిస్, బ్రూసెల్లోసిస్, ద్యూ ఫీవర్, సాల్మోనెల్లోసిస్, హైడాటిడోసిస్, టాక్సోప్లాస్మోసిస్, ట్రిపనసోమియాసిస్, అలాగే ఎలుకల ద్వారా రోసిస్, ప్లేగు వంటి వ్యాధులు సోకుతాయి.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు ఎంతో అవసరం..



సంక్రమిత వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది జంతువులు, మనుషులకు ఎంతో ఉపయోగం. పశు వైద్యశాల వద్ద ఉచిత టీకాలు వేస్తాం. సంక్రమిత వ్యాధులు రాకుండా తగిన సూచనలు, సలహాలు ఇస్తాం. జంతువులను పెంచుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాక్సినేషన్ వేయించుకోవాలి.

– వెంకటరామిరెడ్డి, పశువైద్య శాఖ ఏడీ, సింహాద్రిపురం



వ్యాధి సోకిన పశువు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పశువులకు, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకా మందులు వేయించాలి. పెంపుడు జంతువులకు వారానికొకసారి స్నానం చేయించాలి. జూలు కుక్కలను ప్రతిరోజు దువ్వాలి. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు తాపించాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ప్రతిరోజు స్నానం చేయడం, గోళ్లను ఎక్కువగా పెంచుకోకుండా ఉండటం, తినేముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. అలాగే మరుగకాచిన పాలనే తాగటం, బాగా ఉడకబెట్టిన మాంసాన్నే తినాలి. వ్యాధిగ్రస్త జంతు మాంసం తినకూడదు. దగ్గు వచ్చినప్పుడు రుమాలును నోటికి అడ్డు పెట్టుకొని దగ్గాలి. చవరవారు ఐస్‌క్రీములు తినకుండా ఉండాలి. చిలుకలు, పక్షులతో అతిసన్నిహితంగా మెలగకుండా ఉండాలి. చనిపోయిన పశువులను సున్నపు గుంటలతో లోతుగా పాతిపెట్టాలి. జంతువుల అనారోగ్య లక్షణాలను గమనించి పశువైద్యులను సంప్రదించాలి.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

కమలాపురం : మండలంలోని ఎర్రగుడిపాడు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతులను ఆదుకోవాలి

ముద్దనూరు : వర్షాభావంతో తాము సాగుచేసిన ప్రొద్దుతిరుగు పంట బెట్టస్థితికి చేరుకుందని, ఎరువులు, విత్తనాలు, సేద్యాలకు పెట్టిన ఖర్చులతో నష్టపోతున్న తమను ఆదుకోవాలని రైతులు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్‌తో వాపోయారు. మంగళవారం జేడీఏ స్థానిక ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏవో వెంకటకృష్ణారెడ్డిలతో కలిసి మండలంలోని రాజుగురువాయిపల్లెలో సాగులో వునన ప్రొద్దుతిరుగుడు పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట సాగుచేసి 55 రోజులు గడిచిందని, సకాలంలో వర్షాలు కురవక తేమశాతం లేకపోవడంతో పంటమొత్తం ఎండుదశకు చేరిందన్నారు. అనంతరం కమ్మవారిపల్లెలో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో జేడీఏ, శాస్త్రవేత్త, పాల్గొని రైతులకు కంది, మినుము మినీ కిట్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో లక్ష్మణ్‌కుమార్, ఇతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వెంటనే సమస్యలను పరిష్కరించాలి

పులివెందుల రూరల్ : ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే సమస్యలను పరిష్కరించాలని డీఎస్పీ మురళి నాయక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు పలు సమస్యలను విన్నవించారు. అనేకమార్లు పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పరిష్కరించడంలేదని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారని వివరించారు. దీంతో ఆయన స్పందిస్తూ వివిధ రకాల కేసులు నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా సంబంధిత పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఫిర్యాదుదారులను స్టేషన్ చుట్టూ తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలను సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలోని పరిష్కరించే విధంగా చూడాలన్నారు. చిన్న, చిన్న సమస్యలను కూడా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లవద్దన్నారు. వీలైనంత త్వరగా స్టేషన్ పరిధిలో ఉంటే ఇక్కడే



సమస్యలపై పోలీసులతో చర్చిస్తున్న డీఎస్పీ మురళీ నాయక్

సమస్యలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేసే విధంగా చూడాలన్నారు. డివిజన్ ప్రాంతంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పేకాట, మట్కాపై పూర్తి నిఘా ఉంచామన్నారు. ప్రజలు కూడా పట్టణంలోనూ, గ్రామ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానస్పద స్థితిలో సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.

బలిజ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం ఎన్నిక

వేంపల్లె : స్థానిక గౌరీదేవి బలిజ సంఘంలో మంగళవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బలిజ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్‌లను రెండవసారి బలిజ సంఘం మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని, మరో మూడేళ్లు కమిటీ మెంబర్లు, సభ్యుల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మొదటగా గౌరీదేవి కల్యాణ మండపం ఏర్పాటు కొరకు అడుగులు వేస్తున్నామని, మొదటగా ఆలయంపైన భోజనం చేసేందుకు రేకుల షెడ్డును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత మూడేళ్లలో ఆలయానికి రూ.30 లక్షల వరకు ఆదాయం సమకూరిందన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం గౌరవ అధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, ఆరు షేర్ల రంగయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి పాలన అట్టర్ ఫ్లాప్

వల్లూరు : 13 నెలల కూటమి ప్రభుత్వ పాలన అట్టర్ ఫ్లాప్ అయినట్లు ప్రజలే స్వయంగా పేర్కొంటున్నారని కమలాపురం నియోజకవర్గ వైఎస్‌ఆర్ సీపీ ఇన్‌చార్జి పీ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మండలంలోని సీ కొత్తపల్లె, పాతగాలివారిపల్లె, లింగాయపల్లె గ్రామాలలో వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో నరేన్ రామాంజులు రెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ వాటిని అమలు చేయకుండా మోసగిస్తుండాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రజలను కలుస్తున్నామని, చంద్రబాబు హామీలను, వాటిని ఎగ్గొట్టి ప్రజలకు చేస్తున్న మోసాలను మేము చెప్పడానికి ముందే ప్రజలే స్వయంగా గుర్తు చేస్తున్నారని ఆయన వివరించారు. కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందన్నారు. జగన్ పాలనలో మాకు అనేక పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని, అప్పటి కంటే ఇప్పుడు కరెంటు చార్జీలు పెరిగాయని, రేషన్ సరుకులు తెచ్చుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వారి బాధలను వ్యక్తం చేస్తున్నారన్నారు. మేము బాబు ష్యూరిటీ అనగానే మోసం గ్యారెంటీ అంటూ ప్రజలే స్వయంగా అంటున్నారన్నారు. జగన్ అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ మేము ఆయనకే ఓట్లు వేశాం నాయనా, మరి ఆ ఓట్లు ఎక్కడికి పోయాయో అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం నిట్ట నిలువునా మోసగించిందని విమర్శించారు. ముఖ్యంగా రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారిందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి పార్టీ అభ్యర్థులను బంగాళాఖాతంలో కలపడానికి ప్రజలు సిద్దంగా వున్నారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కిషోర్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, ఎంపీటీసీలు గంగయ్య, సుబ్బరాయుడు, రామకృష్ణారెడ్డి, పార్టీ నేతలు సుబ్బారెడ్డి, శివకుమార్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, విశ్వనాథరెడ్డి, చెన్నారెడ్డి, నారాయణ రెడ్డి, లక్షారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవు

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేక ప్రశ్నించేవారి గొంతు నొక్కేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఎంపీగా ఉన్న మిథున్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి రిమాండ్‌కు పంపడం సరైందికాదన్నారు. రాబోయే రోజుల్లో ప్రస్తుత నాయకులు ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించారు. రాయచోటిలో రమేష్ రెడ్డిని ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ప్రశ్నించినందుకు అరెస్టు చేశారు. అలాగే పెద్దముడియం మండలంలోని పాపాయపల్లె, కల్వటాల గ్రామాల్లో సోలార్ కంపెనీ వారు అడ్డగోలుగా రైతుల భూములు లాకున్నారన్నాని ఆయన విమర్శించారు. సోలార్ కంపెనీ డాకుమెంట్లను ఇంగ్లీషులో అగ్రిమెంట్లు చేసుకుంటూ రైతుల భూములను లీజుకు తీసుకుంటున్నారు. తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకోవడం ఎమిటని సోలార్ ప్రతినిధులను వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, హృషికేశవరెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ఘనంగా జాతీయ జెండా దినోత్సవం

వేంపల్లె : మన భారతదేశ జాతీయ జెండా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శివమునెమ్మ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది జులై 22వ తేదీన జరుపుకునే కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెండాలో ఉన్న మూడు రంగులు త్యాగానికి కాషాయం, తెలుపునకు శాంతి, పాడి పంటలకు ముదురు ఆకుపచ్చ, మధ్యలో నీలపు రంగు అశోక చక్రం ధర్మానికి సంకేతమన్నారు. స్వాతంత్రంలో అమరులైన వారందరినీ స్మరణకు గుర్తుతెస్తుందన్నారు. ఇంతటి చరిత్ర కలిగిన జాతీయ జెండా మనందరికి గర్వకారణమన్నారు. జాతీయ జెండాను ప్రతి పౌరుడు గౌరవించి దాని ఖ్యాతిని, ప్రత్యేకతను ప్రపంచానికి తెలిసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం సూపర్ ఫెయిల్యూర్

చింతకొమ్మదిన్నె : చంద్రబాబు, కూటమి నాయకులు ప్రజలకు సూపర్ సిక్స్ పేరిట అనేక సంక్షేమ పథకాలను ప్రకటించి అధికారంలోకి రాగానే తమ సంకుచిత బుద్ధితో నేడు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో సూపర్ ఫెయిల్యూర్ అయిందని కమలాపురం వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. గతంలో జగనన్న ప్రభుత్వం పార్టీలు చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించగలిగారన్నారు. చంద్రబాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాలలో భాగంగా మంగళవారం ఉదయం మండల కేంద్రంలో ఆయన ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో అన్ని వర్గాల ప్రజలను మోసపుచ్చి అధికారంలోకి వచ్చారని, వచ్చిన వెంటనే ప్రజలకు గతంలో జగనన్న ప్రభుత్వం అందించిన అనేక సంక్షేమ పథకాలను నిలుపుదల చేశారన్నారు. చివరికి కొత్త పెన్షన్‌లు కూడా ప్రజలకు అందించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. క్షవర త్తిదారులు, టైలరింగ్, ఆటోలు నడుపుకునేవారు తమకు జగనన్న ప్రభుత్వంలో ప్రతి సంవత్సరం తప్పకుండా ఆర్థికంగా చేయూత అందేదని ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వంలో ఆర్థికంగా చితికిపోయామని తెలుపుకున్నారు. కార్యక్రమంలో కమలాపురం నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుధాకరరెడ్డి, కళా యాదవ్, స్థానిక నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పరిధిలోని కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

కమలాపురం : 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రతి మూడు మాసాలకొకసారి రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ విద్యా సాగర్ తెలిపారు. కడప జిల్లా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన ద్వితీయ వార్షిక రక్తదాన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక 3వ వార్డు సచివాలయంలో రివర్ ఫ్లో ఫౌండేషన్, అభి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. పోలీస్, ఫైర్, అగ్రికల్చర్, రెవెన్యూ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, యువకులు, విద్యార్థులు 22 మంది రక్తదానం చేశారు. నిర్వాహకులు సవ్యసాచి, విజయ్ బాబు మాట్లాడుతూ ఏ ల్యాబ్‌లో తయారు చేయలేనిది రక్తం మాత్రమేనన్నారు. అలాంటి రక్తాన్ని మనిషి మాత్రమే దానం చేయగలరన్నారు. ఒక రోజు రెండు రోజులు కాకుండా వారం రోజుల పాటు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తే రక్త నిల్వలు పెరుగుతాయనే ఉద్దేశంతో స్వచ్ఛంద సంస్థలు ఈ నిర్ణయం తీసుకున్నామని, అయితే ఈ నిర్ణయానికి అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని వారు హర్షం వ్యక్తం చేశారు. అమ్మ జన్మనిస్తే, రక్తదాత పునర్జన్మనిస్తాడని, ఇలాంటి పుణ్యకార్యాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వలన అనేక ఆరోగ్య లాభాలు ఉన్నాయని, యువత రక్తదానం కోసం నడుం బిగించాలన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న సీఐ ఎస్‌కే రోషన్

అనాథ వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న కుటుంబ సభ్యులు

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలోని అనాథ వృద్ధులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. మంగళవారం చక్రాయపేట మండలంకు చెందిన కర్నాటి భరత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా చక్రాయపేటలోని వాసు స్టూడియో ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం చేపట్టి వృద్ధులంరికి పండ్లు కూడా పంపిణీ చేశారు. అలాగే చక్రాయపేట గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌లోని విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్యాడ్, పెన్సిల్, నోటు పుస్తకాలను అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించరాదు

వేంపల్లె : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ నరసింహులు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలకు సంకేతం అనే వాల్ పోస్టర్లను ఆయన అవిష్కరించి మాట్లాడారు. మైనర్లకు మోటర్ బైకులను తల్లిదండ్రులు ఇవ్వడం వలన ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడిపితే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. వాహనాలు నడిపే ప్రతి వాహనదారుడు లైసెన్స్‌లు, రికార్డులను కూడా సక్రమంగా పెట్టుకోవాలని కోరారు. వాల్ పోస్టర్లను ఆటోల వెనుక ప్రజలకు తెలిసేలా ఆటో డ్రైవర్లు అతికించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న సీఐ నరసింహులు, తదితరులు

భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి

కమలాపురం : రైతులు తాము సాగు చేసుకునే పంట పొలాల్లో సాగుకు ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లె, జి. అప్పాయపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలు తదితర అంశాలపై రైతులకు వారు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించు కోవాలన్నారు. భూసార పరీక్ష ఫలితాల ద్వారా అవసరమైన మేరకు రసాయనిక ఎరువులను, పురుగు మందులను వాడవచ్చన్నారు. అధిక మోతాదులో ఎరువులు వాడటంతో నేల విషతుల్యం అవుతుందన్నారు. నేలల్లో తగిన సేంద్రీయ పదార్థం ఉన్నపుడు మాత్రమే సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందుతాయని, భూమి పోషకాల స్థాయి మధ్యస్థంగా ఉన్నపుడు సిఫారసు చేసిన ఎరువుల మోతాదును మాత్రమే వాడాలన్నారు. ఈ విధంగా చేయడం వలన ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్టు ఎరువులు, జీవన ఎరువులను సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా చేసుకుని రసాయన ఎరువుల వాడకాన్ని 25 నుంచి 50 శాతం తగ్గించుకుని డబ్బులు ఆదా చేసుకోవాలని తెలియజేశారు. పశు వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి గడ్డి విత్తనాల పంపిణీ, పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

సింహాద్రిపురం : భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి కళ్యాణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని బలపనూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులకు పంటల బీమా గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఉష, మహేశ్వరి, రాజీవ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో ఆదాయం


వేముల : అంతర పంటల సాగు చేయడం ద్వారా ఆదాయం ఉంటుందని ఏఓ ఓబులేసు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని గొందిపల్లె, రంగోరిపల్లె గ్రామాల్లో పత్తి పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ దీర్ఘకాలిక పంటలు సాగు చేశాక, వాటిలో అంతర పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడులు వస్తాయన్నారు. పచ్చిరొట్టల ఎరువు వాడకంవల్ల భూమిలో సేంద్రీకరణ పెరిగి పంటల దిగుబడి బాగుంటుందన్నారు. పిల్లి పెసర ఎకరానికి 20 కేజీలు వాడి కలియ దున్నుకోవాలని, అనంతరం సింగిల్ సూపర్ పాస్ఫేట్ 100 కిలోలు వాడటంతో సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వేములలో పత్తి పంటలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలి

వేంపల్లె : వర్షాభావ పరిస్థితులవల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రైతులకు సూర్యనంది అనే రకానికి చెందిన కొర్రెలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ ద్వారా షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ద్వారా చిరుధాన్యాల సాగు పెంపొందించాలన్న ఉద్దేశంతో రైతులకు ఉచితంగా కొర్రలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాలు మన ఆరోగ్యవంతమైన జీవితంలో ముఖ్య బాగామని, చిరుధాన్యాల సాగును ప్రకృతి వ్యవసాయం ద్వారా సులభతరంగా పండించవచ్చునన్నారు. అలాగే మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహేష్ బాబు, సాయి మహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.



వేంపల్లెలో రైతులకు కందుల ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు, తదితరులు

వరి పంటలో కాలి బాటలు తప్పనిసరి

లింగాల : వరి పంటలో కాలిబాటలు తప్పనిసరి మండల వ్యవసాయాధికారి రమేష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పార్నపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రమేష్ మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించి లాభసాటి వ్యవసాయ చేయాలంటే వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. అలాగే రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలన్నారు. వరి నాట్లు వేసేటప్పుడు నారు కొనలు త్రుంచి వేయడంవలన ఆకుముడత రాకుండా నివారించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది పవన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.